


హైదరాబాద్ వార్త

# శివార్లలో తెగించిన స్నాచర్లు

**వృద్ధురాలి మెడలో నుండి 11 తులాల గొలుసులు తెంపుకొని పరార్**

**అడ్డుకున్న వృద్ధురాలి చేతికి గాయం**



**స్నాచింగ్ సమయంలో ప్రతిఘటించి గాయపడ్డ బాధిత వృద్ధురాలు కనక రత్నం**

సరూర్‌నగర్, నవంబర్ 5 ప్రభాతవార్త: హైదరాబాద్ నగర శివార్లలో చెయిన్ స్నాచర్లు తెగించారు. ఉదయమే వీధుల్లో మాటు వేసి పూల కోసం బయటకు వచ్చిన ఓ వృద్ధురాలిని టార్గెట్ చేసి ఏకంగా 11 తులాలు ఉన్న మూడు బంగారు గొలుసులను లాక్కొనే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ప్రతిఘటించిన వృద్ధురాలి మెడలోని గొలుసులను తెంపుకొనే యత్నంలో ద్విచక్ర వాహనంపైన ఉన్న అగంతకులు ఆమెను కొంత దూరం పాటు లాక్కెళ్లారు. ఎట్టకేలకు గొలుసులను స్నాచ్ చేసిన దుండగులు పారిపోతుండడంతో పట్టుకునే ప్రయత్నం చేసిన స్థానికులను కత్తులతో బెదిరించి రెప్పపాటులో మాయమయ్యారు. ఈ హఠాత్పరిమాణానికి బిత్తరపోయిన వృద్ధురాలు తేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలో దిగిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. తీవ్ర కలకలం రేకెత్తించిన ఈ సంఘటన హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న రాచకొండ పోలీస్ కమీషనరేట్ కిందకు వచ్చే మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మీర్‌పేట్ ప్రగతినగర్‌కు చెందిన కనక రత్నం (65) అనే వృద్ధురాలు కార్తీక మాసం నేపథ్యంలో శనివారం ఉదయం పూల కోసం బయటకు వచ్చింది. అప్పటికే స్థానిక రోడ్లపై స్నాచింగ్‌ల కోసం మాటు వేసి ఉన్న హోండా యాక్టివ్ వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమెను వెంబడించి మెడలో ఉన్న బంగారు గొలుసులను లాక్కొన్నారు. ఈ క్రమంలో వృద్ధురాలి చేతికి గాయమై పడిపోయింది. అయితే పారిపోతున్న నిందితులను పట్టుకోవడానికి స్థానికులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి వచ్చి విచారణ జరిపారు గాయపడిన వృద్ధురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా సంఘటనా ప్రాంతాన్ని వనస్థలిపురం ఎసిపి పురుషోత్తంరెడ్డి, ఇన్స్‌పెక్టర్ మద్ది మహేందర్‌రెడ్డిలు పరిశీలించారు. నిందితులను గుర్తించడానికి క్రైం పోలీసులు సిసి కెమెరాల పుటేజీలను పరిశీలించే పనిలో ఉన్నారు.

## అద్భుతంగా సాగిన వేదవ్యాస శ్రీరామభట్టర్‌చే 'రుక్మిణి కల్యాణం' హరికథాగానం

చిక్కడపల్లి, నవంబరు 5 ప్రభాతవార్త: నల్లకుంటలోని శృంగేరి శంకర్‌మఠంలో శ్రీ పూర్ణయజు కళాపీఠం, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ముటూ్నరి యజునారాయణశర్మ భాగవతార్ 113వ జయంతి సందర్భంగా 'హరికథా మహోత్సవాల' ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత సీనియర్ ఐపీఎస్ అధికారి, ప్రముఖ రచయిత రావులపాటి సీతారామారావు హాజరై అద్భుంగా హరికథాగానం చేసిన వేదవ్యాస శ్రీరామభట్టర్‌లను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వేదవ్యాస శ్రీరామభట్టర్‌చే 'రుక్మిణీ కళ్యాణం' హరికథాగానం అద్భుతంగా సాగింది. వయోలిన్‌పై ఎం.శశిభూషణరావు, మృదంగంపై ఎం.మురళీకృష్ణ వాద్యసహకారాన్ని అందించారు.

# తీవ్ర విషాదం

**చెరువులో పడి ఐదుగురు విద్యార్థులు, ఉపాధ్యాయుడు మృతి**

**మృతులంతా అంబర్‌పేటవాసులు**



మృతిచెందిన ఉపాధ్యాయుడు

చిన్నారులను మింగిన ఎర్రగుంట చెరువు



హైదరాబాద్, నవంబరు 5 ప్రభాతవార్త : సరదాగా ఉపాధ్యాయుడు విద్యార్థులను విహారానికి తీసుకొని వెళ్లారు. అప్పటికప్పుడు ఉల్లాసంగా ఆడుకుంటున్న విద్యార్థులు.. ఉన్నట్టుండి పక్కనే ఉన్న చెరువులో ఈతకు వెళ్లాలి అనుకున్నారు. ఈతకొట్టడానికి చెరువులోకి దిగిన వారు మునిగిపోతుంటే.. వారిని రక్షించే క్రమంలో ఉపాధ్యాయుడు సైతం నీటిలో మునిగి చనిపోయారు. ఈ తీవ్ర విషాదం నగరంలో చోటుచేసుకుంది. నగర శివారు ప్రాంతంలోని జలహార్ నగర్ పరిధిలో ఉన్న మల్కారంలోని ఎర్రగుంట చెరువులో ఈతకు దిగి ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో ఐదుగురు విద్యార్థులు ఉన్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని ఈతగాళ్ల సాయంతో చెరువులో నుంచి మృతదేహాలను వెలికితీయించారు. మృతి చెందిన విద్యార్థులంతా 10 నుంచి 12 ఏళ్ల వయసు ఉంటారు. మృతిచెందినవారు అంబర్‌పేట నియోజక వర్గం పరిధిలోని కాచిగూడ, అడ్డి కార్ఖానాలోని హనీఫా మదర్సాకు చెందిన వారిగా గుర్తించారు. ఖాద్రిబాగ్‌కు చెందిన ఇస్మాయిల్ (11) అడ్డి కార్ఖానకు చెందిన జాఫర్ (10), సోహేల్ (11),గోల్నాకకు చెందిన అయాన్ (11), సుందర్‌నగర్‌కు చెందిన రియాన్ (11),అంబర్‌పేట సీపీఎల్ మసీద్ కు చెందిన యోమాన్ (25)లు మృతి చెందారు. వీరంతా అడ్డి ఖార్ఖాన, సుందర్‌నగర్, నెహ్రూనగర్ ప్రాంతాలతో పాటు అంబర్‌పేట చెందిన వారు కావడంతో ఆయా ప్రాంతాల్లో విషాదచాయలు అలుముకున్నాయి. కాగా కాచిగూడ పోలీసులు అడ్డి కార్ఖాన ప్రాంతంలోని మదర్సా ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించారు. హానీఫా మదర్సా నుంచి 37 మంది విద్యార్థులు 4 టీచర్లు కలిసి జవహార్‌నగర్‌లో జరిగిన ఓ ఫంక్షన్‌కు డీసీఎంలో వెళ్లారు. మదర్సాలో వీరంతా ఉదయం, సాయంత్రం వేళల్లో అరబ్బి నేర్చుకోవడానికి వెళ్తుంటారు. మృతుల కుటుంబాలను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ లు పరమార్శించారు.



**మృతుల కుటుంబాలను గాంధీ ఆస్పత్రిలో పరామర్శించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్**

## రూపాదేవి నటన నేటి నటులు పాఠాలుగా గ్రహించాలి: రేలంగి నరసింగరావు

చిక్కడపల్లి, నవంబరు 5 ప్రభాతవార్త: తొలినాళ్లలో దూరదర్శన్ సీరియల్స్ కథా నాయకిగా వెలుగొందిన రూపాదేవి నటన నేటి నటులు పాఠాలుగా గ్రహించాలని ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో రెట్రో రాగాస్ డిజిటల్ స్టూడియో ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రేలంగి నరసింహారావు హాజరై ప్రసంగించారు. రూప పేరుకు తగ్గ రూపంతో పాటు ఉత్తమ నటనతో ప్రేక్షకుల అభిమానం చూరగొన్నారని ప్రశంసించారు. ఘంటసాల గానసభ అధ్యక్షుడు డాక్టర్ కె.వి.రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నటి పూర్ణిమ, త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి, శుభోదయం గ్రూప్ అధినేత లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. సంస్థ డైరెక్టర్ విఎస్.మూర్తి సంస్థ నివేదికను సమర్పించగా కన్వీనర్ కృష్ణకుమారి స్వాగతం పలికారు.

# మెట్రో ఛార్జీలు పెంచొద్దు

**ఉన్నవాటినే కొనసాగించాలి**

**ఛార్జీలపెంపు ప్రతిపాదన వ్యతిరేకిస్తున్న ప్రయాణికులు**



హైదరాబాద్, నవంబర్ 5, ప్రభాతవార్త: మెట్రో ఛార్జీలను సవరించాలనే ప్రతిపాదనను ప్రయాణికులు తీవ్రంగా వ్యతిరేకి స్తున్నారు. ఉన్నఛార్జీలే ఎక్కువ అంటున్నారు. ఇప్పటికే బస్, ఎంఎంటిఎస్ ఛార్జీలు పెంచారని, పెట్రోల్ రేట్లు సైతం మండిపోతున్నాయని వాపోతున్నారు. ఈసమయంలో మెట్రో టికెట్‌రేట్లు పెంచి తమపై భారం మోపొద్దని కోరుతున్నారు. మెట్రోరైల్ ఛార్జీలు పెంచేందుకు అవకాశం ఇవ్వాలని హైదరాబాద్ మెట్రో సంస్థ ఇటీవల కేంద్రాన్ని అభ్యర్థించగా ,కేంద్రం ఒకకమిటీని ఏర్పాటు చేసింది. ఆకమిటీ ఈనెల 15వరకు మెయిల్ ద్వారా ప్రయాణికుల సలహాలు తీసుకుం టుంది. దీంతో కమిటీకి చాలామంది ప్రయాణికులు మెయిల్ ద్వారా ఛార్జీలు పెంచొద్దని తమ వాణిని వినిపిస్తున్నారు. కాగా సిటీలో త్వరగా గమ్యస్థానానికి చేరాలంటే ఉన్న ఏకైక మార్గం మెట్రో రైల్, ప్రస్తుతం 3కారిడార్ల పరిధిలో రోజు 4లక్షల మందికి పైగా ప్రయాణిస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో ప్రతి రైలు కిక్కిరిసిపోయి కనిపిస్తుంది. పెరిగిన ఆర్టీసి బస్ ఛార్జీలు, ట్రాఫిక్ సమస్యతో ఎంతోమంది మెట్రోనే ఎక్కుతున్నారు. ఇప్పుడు వీటి ఛార్జీలు కూడా పెంచితే ఎలా అని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మెట్రో టికెట్ ధర కనిష్టంగా రూ.10, గరిష్టంగా రూ.60గా ఉంది. 2017 నవంబర్ 28నుంచి ఈచార్జీలు అమల్లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదంతో ఎల్‌అండ్‌టి, హైదరా బాద్ మెట్రో అమలు చేస్తుంది. మెట్రోరైల్ చట్టం ప్రకారం అడ్మినిస్ట్రేషన్‌కు మొదటిసారి మాత్రమే ఛార్జీలు పెంచేందుకు అవకాశం ఉంటుంది. మరోసారి పెంచాలంటే కేంద్రం అనుమతి తప్పనిసరి.ఈనేపథ్యంలో మెట్రో సంస్థ ప్రతిపాదనతో కేంద్రం ఇటీవల కమిటీని నియమించింది. కమిటీ సిఫార్సులతో చార్జీలపెంపుపై నిర్ణయం తీసుకోనున్నారు.

**పెంచితే పేదలకు కష్టం..** మెట్రోఛార్జీలు పెంచితే మధ్యతరగతి వారికి ప్రయాణం భారం అవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవు తుంది. ఇప్పటికే హైదరాబాద్ మెట్రోలో చార్జీలు ఢిల్లీ మెట్రో కంటే అధికంగా ఉన్నాయని ఇప్పుడు మళ్ళీ పెంచుతామంటే ఎలా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే బస్,ఎంఎం టిఎస్ ఛార్జీలు, పెట్రోరేట్లు పెరిగాయని ఛార్జీలు పెంచితే సామన్యులపై మరింత భారం పడుతుందని అంటున్నారు.

### కరెంటు సరఫరా నిలిపివేత

నార్సింగి, నవంబర్ 5 ప్రభాతవార్త : కిస్మత్‌పూర్ 132.కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తుల కారణంగా నేడు ఉదయం 9.గంటల నుంచి మధ్యాహ్నం 12.గంటల వరకు కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కిస్మత్‌పూర్, దర్గా కలిస్కాన్ ప్రాంతాల ప్రజలు ఈ విద్యుత్ అంతరాయంకు మాకు సహకరించాలని అధికారులు పేర్కొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు జాగ్రత వహించాలి

- చిన్నపిల్లల వైద్యురాలు డా.శివరంజని సంతోష్
- సంఘీనగర్‌లోని ఆర్తి ఆడిటోరియంలో తల్లిదండ్రులకు అవగాహన సదస్సు





**సంఘీనగర్‌లో రవిషాసంఘీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్‌ఎయిడ్ అండ్ చైల్డ్ హెల్త్ సెమినార్‌లో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శివరంజనిసంతోష్, అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం, చిత్రంలో రవిషా సంఘీ**

హయత్‌నగర్, అక్టోబరు 5 ప్రభాత వార్త : చిన్నపిల్లల ఆరోగ్య విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలని ప్రముఖ చిన్నపిల్లల వైద్యురాలు శివరంజని సంతోష్ సూచించారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి సంఘీనగర్‌లోని ఆర్తి ఆడిటోరియంలో రవిషాసంఘీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించిన ఫస్ట్‌ఎయిడ్ అండ్ చైల్డ్ హెల్త్ సెమినార్‌లో ఆమె చిన్నపిల్లల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధుల బారిన పడినపుడు చేపట్టాల్సిన చర్యల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జలుబు, జ్వరం, దగ్గు వంటి చిన్నచిన్న వ్యాధులకు భయపడి మోతాదుకు మించి మందులను వాడడం మంచిది కాదన్నారు. రెండు, మూడు రోజులకు కూడా తగ్గని పక్షంలో వైద్యులను సంప్రదించాలన్నారు. ఫిట్స్ వంటి వాటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాంతులు, విరోచనాలు ఉంటే శరీరంలో నీరు, లవణాలను కోల్పోకుండా చూసుకోవాలన్నారు. ఆ సమయంలో గంజి, మజ్జిగ వంటి వాటిని పిల్లలకు అందించాలన్నారు. 6-8 గంటల పాటు ఆహారం ఇవ్వరాదన్నారు. ద్రవ పదార్థాలతో పాటు తేలికపాటి జీర్ణం అయ్యే వాటిని ఇవ్వాల న్నారు. చిన్నారులకు వాడే సిరఫ్‌లను మూతలు తెరిచిన తరువాత రెండు నెలలు మాత్రమే వాడాలన్నారు. చిన్న పిల్లలు ఎలాంటి వ్యాధులకు గురైనా తల్లిపాలను మాత్రం తప్పకుండా పట్టించాలన్నారు. శరీరంలో గాయాలయి రక్తం కారిన సమయంలో 10 నిముషాల పాటు శుభ్రమైన వస్త్రంతో అదిమిపట్టాలని సూచించారు. ఊపిరి పీల్చుకోవడం ఇబ్బందిగా ఉండి స్పృహ కోల్పోయినపుడు సీపీఆర్ ఎలా చేయాలో ఆమె అక్కడివారితో చేయించారు. ఈ సందర్భంగా ప్రజలు చిన్నారుల ఆరోగ్యంపై అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు, సలహాలు, సూచనలు అందించారు.

## రసరమ్యం నేత్రపర్వం..
## లాస్యరంజని ఆంధ్రనాట్యం నృత్య ఆరాధన



కళాకారిణుల నృత్య ఆరాధనలో దృశ్యం

నాంపల్లి, నవంబరు 5 ప్రభాతవార్త : భారత కళా ప్రపూర్ణ, పద్మశ్రీ డా. నట రాజ రామకృష్ణ శతజయంతి వేడుకలను పురస్కరించుకొని ప్రముఖ సంస్థ లాస్యరంజని క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ ప్రముఖ నాట్యగురువు రేఖ గిరిశాకృతి శిష్యబృందం ఆగమ, ఆస్థాన నర్తన సంప్రదాయాలలో ఆంధ్రనాట్యం తో నృత్య ఆరాధన నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో శనివారం రాత్రి రసరమ్యం, నేత్రపర్వంగా సమర్పించింది. ఈ నత్యఆరాధనలో కుంభహారతి, పుష్పాంజలి, అలరిప్పు; వినాయకకౌతం; శివకైవారం-గంగాధర; రారా మాయింటికి గీతం; త్రిపుర సంహారశబ్దం; అన్నమాచార్య కీర్తన-ముద్దుగారే యశోద; విష్ణుకైవారం-సంధ్యా సమయం; కొమ్మరోవానికెంత బిగువే; ఆధ్యాత్మ రామాయణ కీర్తన; దశావతారము తదితర అంశాలను సరయు, కళ్యాణిరెడ్డి, శ్రీషణ్ముఖి, జ్వాలాసుమ, వెంక టచైత్రిక, అన్విత, ఇషాన్వి, సాయి హర్షవర్ధిని, జయహారిని, యష్మిత, వర్షిత, రిషిత, రాధిక, భావజ్ఞ కళాకారిణులు తమ అద్భుత లయబద్ధ పదవిన్యాసంతో నృత్యవైభవాన్ని చాటారు.

# నిజాం హాస్టల్‌లో విద్యార్థినిలకు ప్రవేశం కల్పించాలి

**కళాశాల ప్రిన్సిపల్ ఛాంబర్‌ను ముట్టడించిన విద్యార్థులు**

**పిజి అమ్మాయిలకే హాస్టల్: ప్రిన్సిపల్ ప్రకటన**

**ఉద్రిక్తత, తోక్కిసలాట మధ్య విద్యార్థులను అరెస్టు చేసిన పోలీసులు**



**ప్రిన్సిపల్‌తో వాగ్వివాదం**

సైఫాబాద్, అక్టోబరు 5 ప్రభాతవార్త: నిజాం కళాశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన హాస్టల్‌లో అండర్ గ్రాడ్యుయేషన్ అమ్మాయిలకే ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆనేక మంది విద్యార్థులు శనివారం కళాశాల ప్రిన్సిపల్ ఛాంబర్‌ను ముట్టడించారు. ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు వైస్-చాన్సలర్, పిన్సిపల్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అండర్ గ్రాడ్యుయేషన్ అమ్మాయిలకే ప్రవేశం కల్పించా లని, ఓయూ వైస్-ఛాన్సలర్, ప్రిన్సిపల్ డౌన్, డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. పోలీసులకు విద్యార్థులకు మధ్య వాగ్వివాదం, తోక్కిసలాట జరిగింది. పోలీసులు విద్యార్థులను బలవంతంగా అరెస్టు చేశారు. రెండు వ్యానుల్లోకి విద్యార్థులను పోలీసులు ఈడ్చుకుంటూ తీసుకువెళ్ళి అబిడ్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గతంలో రాష్ట్ర మంత్రి కెటిఆర్ నిజాం కళాశాలలోని అమ్మాయిలకు హాస్టల్ నిర్మించి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కెటిఆర్ ఇచ్చిన హామీ ప్రకారం కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ భవనాన్ని నిర్మించడం జరిగింది. ఈ హాస్టల్‌లో అండర్ గ్రాడ్యూయేషన్ అమ్మాయిలకే వసతి సౌకర్యం కల్పించాలని, పిజి అమ్మాయిలకు కేటాయించరాదని గత కొంత కాలంగా విద్యార్థులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. కాగా గత నెల 29వ తేదీన వందలాది మంది విద్యార్థులు హాస్టల్‌లో అండర్ గ్రాడ్యూ యేషన్ అమ్మాయిలకు ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేస్తూ కళాశాల ఎదుట బషీర్‌బాగ్‌లోని రోడ్డు మీద భారీగా ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ కార్యాలయం ఎదుట కూడా ధర్నా చేపట్టారు. ఆనాడు కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఓయూ వైస్-చాన్సలర్‌తో చర్చించి ఐదురోజుల్లోగా తగు నిర్ణయిం తీసుకుంటానని విద్యార్థులకు హామీ ఇవ్వడంతో వెనుదిగారు. కాగా హాస్టల్‌లో పిజి అమ్మాయిలకే ప్రవేశం కల్పించాలని వైస్-చాన్సలర్ ఆర్డర్ ఇచ్చారని కళాశాల ప్రిన్సిపల్ ప్రకటించారు. దీంతో విద్యార్థులు విసి, ప్రిన్సిపల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన గ్రాడ్యూయేషన్ అమ్మాయిలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా పోలీసులు అరెస్టు చేసిన విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు పెద్దఎత్తున నినాదాలు చేశారు.

## వ్యాపారులు నిర్ణీత సమయంలో షాపులు మూసి వేయాలి : సిఐ కోటీశ్వరరావు



**వ్యాపారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డబీర్‌పుర సిఐ కోటీశ్వరరావు**

చార్మినార్, నవంబరు 5 ప్రభాతవార్త : వ్యాపారులు నిబంధనలు పాటించి నిర్ణీత సమయంలో హోటళ్లు, షాపులు,బేకిరీలు మూసివేయాలని డబీర్‌పుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కోటీశ్వరరావు అన్నారు.డబీర్‌పుర పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం హోటళ్లు, షాపులు,బేకిరీల వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు నిర్ణీత సమయంలో షాపులు,హోటళ్లు మూసి వేయాలని,లేనిచో కేసులు నమోదు చేస్తామని తెలిపారు.డబీర్‌పుర పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## తెలంగాణలో విద్యావిధానంపై సమీక్ష జరగడం లేదు

**విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఆకునూరి మురళీ**



**ప్రసంగిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఆకునూరి మురళీ**

చిక్కడపల్లి, నవంబరు 5 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో విద్యావిదానంపై సమీక్ష జరగడం లేదని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఆకునూరి మురళీ ఆందోళన వ్యక్తం చేశారు. మానవహక్కుల వేదిక 9వ హైదరాబాద్ జిల్లా మహాసభలు శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ప్రారంభమయ్యాయి. ఈ సభకు ముఖ్యఅతిథులుగా ఆకునూరి మురళీ మాట్లాడుతూ ఒక ప్రాంతంతో పాటు విద్యారంగం అభివృద్ధి చెందాలంటే అందరికి విద్య అందుబాటులో ఉంటేనే సాధ్యమవుతుందని, సరిగ్గా పనిచేస్తే 8 నుంచి 10 సంవత్సరాలు విద్యను అభివృద్ధి చేయవచ్చ న్నారు. విద్యావంతులు మాత్రమే ఈ సమస్యకు పరిష్కారాలు కనుగొనగలుగుతారని, ఫలితంగా ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ సమావేశంలో మూంట్‌ఫోర్డ్ సోషల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ వర్గీస్, మాంట్‌ఫోర్డ్ నివాస హక్కుల కార్యకర్త హైమా, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. వివిధ రకాల సమస్యలపై ధర్నాలు, రాస్తారోకోలు, వినతిపత్రాలు, సభలు, సమావేశాలు ఇతర సంస్థలతో కలిసి స్పందిస్తూ ఎన్నో అంశాలపై అవగాహన కలిగించడం జరిగిందని, ప్రభుత్వ అమలు చేస్తున్న అప్రజాస్వామిక చర్యలను ఖండిస్తూ, ప్రజలకు ఏం కావాలలి, ప్రభుత్వాలు ఏమి చేయాలి, ప్రభుత్వ జవాబుదారితనాన్ని గుర్తుచేస్తు అందరి సహకారాలతో పనిచేస్తున్నట్లు సంజీవ్ వివరించారు.

# అరెస్టులతో ప్రజాస్వామ్యం పరిడవిల్లదు


అరెస్టయిన మహాలక్ష్మీరామన్‌గౌడ్ తదితరులు


బిజెపి నేతలను అరెస్టు చేసిన పోలీసులు


నినాదాలు చేస్తున్న బీజేపీ నేతలు


బీజేపీ నేతల అరెస్టు దృశ్యం


మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ హౌస్ అరెస్ట్ దృశ్యం

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ సిఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోలీస్ కమిషనరేట్‌ను ముట్టడించడానికి వెళుతున్న బిజెపి కార్యకర్తలు, నాయకులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. బిజెపి నగర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మి రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో 20 మంది కార్యకర్తలు వెళుతుండగా మార్గమధ్యంలో బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నర్సింగ్‌ముదిరాజ్, పి.ప్రసాద్, మహేష్, కేశబోయిన శ్రీధర్, కవిత, జైస్వాల్, శారద, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**హైదరాబాద్ :** పోలీసుల దాడులకు నిరసనగా పోలీస్ కమిషనరేట్ ముట్టడికి బయలు దేరిన బిజెపి నాయకులను పోలీసులు వారి, వారి నివాసాల వద్ద బలవంతంగా అరెస్టు చేసి అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బిజెపి నాయకులు బి.వెంకట్‌రెడ్డి, దాసోజు నాగభూషణంచారి, కత్తుల సుదర్శన్, మైలారం రాజు, తిరుపతిగుప్తా, రామ్‌రెడ్డి, నరేష్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

**తార్నాక :** టీఆర్ఎస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నా పోలీసులు వారిపై ఎలాంటి కేసులు పెట్టకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్ గౌడ్, పోచయ్య యాదవ్ ఆరోపించారు. కమాండ్ కంట్రోల్ ముట్టడికి బీజేపీ పిలుపు నిచ్చిన నేపథ్యంలో ముందస్తుగా ఓ.యూ పోలీసులు బీజేపీ నేతలను అదుపులోకి తీసుకొని పిఎస్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న, ఆకుల శ్రీనివాస్, వేణుయాదవ్, కృష్ణగౌడ్, గోవర్ధన్, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సికింద్రాబాద్ :** సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేతలను శనివారం తెల్లవారుజామునే అదుపులోకి తీసుకున్నారు. వారిని చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి వారిని బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యాక్రమంలో రవిప్రసాద్ గౌడ్, రాచమల్ల కృష్ణమూర్తి, ప్రభుగుప్త, సుక్క గణేష్‌ముదిరాజ్, అంబాల రాజేశ్వర్‌రావు, హనుమంతులు పాల్గొన్నారు.

**చార్మినార్ :** టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని మాజీ బిజెపి అధికార ప్రతినిధి, సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్‌అలీ బాక్రీ అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసన తెలియ జేయటానికి ప్రయత్నించిన చార్మినార్ నియోజకవర్గానికి చెందిన మీర్ ఫిరాసత్ అలీ బాక్రీని డబీర్‌పుర పోలీసులు నూర్‌ఖాన్ బజార్‌లో హౌస్ అరెస్ట్ చేశారు.

# యువకులు స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలి

**కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 5, ప్రభాతవార్త :** ప్రభుత్వంపై ఆధారపడకుండా యువకులు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ సూచించారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉజ్జయిని మహంకాళి నగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన హావీస్ డ్రైవ్ ఇన్‌ను శుక్రవారం రాత్రి ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా విచ్చేసి స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షులు అనిల్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు జిల్లా గణేష్, తెరాస నాయకులు దొడ్ల రామకృష్ణాగౌడ్, కాశినాథ్‌యా0దవ్, చిన్నోళ్ళ శ్రీనివాస్, చంద్రమౌళిసాగర్, వాసుదేవరావు, పోశెట్టిగౌడ్, రవికిరణ్, రాములుగౌడ్, కైసర్, జీవన్‌రెడ్డి, వెంకటేష్, హరీష్, మారుతి, కూర్మయ్య హోటల్ నిర్వాహకులు దామోదర్‌రెడ్డి చిట్టిముడి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

**యూసుఫ్‌గూడ, నవంబర్ 5, ప్రభాతవార్త :** బస్తీలలో నివసించే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గాను మజీద్ కమిటీ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమని బోరబండ ఎన్ఆర్ ఆర్‌పురం కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుల ఎమ్‌ఏ సత్తార్ అన్నారు. ఇందుకుగాను శనివారం బోరబండ సైట్1లో మజీద్ ఈ అక్బరీ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఇందులో ఆస్టిన్ ప్రైమ్ హాస్పిటల్ వైద్యులు పాల్గొని అన్ని రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను కూడా ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలియజ్ అహ్మద్, ఎమ్‌డీ జహంగీర్, ఎమ్‌డి గులామ్ అలీ తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్‌ఏ సత్తార్

# 19, 20తేదీల్లో 'భారత్ బచావో' మేథోమధన సదస్సు

**హైదరాబాద్, నవంబర్ 5, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్యం, రాజ్యాంగ రక్షణ తదితర అంశాలపై ఈనెల 19, 20 తేదీల్లో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో భారత్ బచావో మేథోమధన సదస్సును నిర్వహిస్తున్నట్లు భారత్ బచావ్ సభ్యులు డాక్టర్ గోపినాథ్ తెలిపారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆహ్వాన కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వర్‌రావు, విశ్రాంత ఉపాధ్యాయులు సోమన్న, కవి రచయిత సైకిబాబుతో కలిసి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అమలు పరచడంతో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర వైఖరి చూసి పలు రాష్ట్రాల ప్రభుత్వాలు వణికిపోతున్నాయని, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్‌లో ఏంజరిగిందో చూశామని, తెలంగాణ, ఢిల్లీ తమిళనాడులో ప్రభుత్వాలను కూల్చివేసే కుట్రలు చేస్తుందన్నారు. ఇది ఫెడరల్ స్ఫూర్తికి విఘాతమని రాజ్యాంగాన్ని దేశాన్ని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డా.గోపినాథ్, పిఎల్ విశ్వేశ్వర్‌రావు,సోమన్న తదితరులు

# భగవంతున్ని వేడుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయి

**కంటోన్మెంట్, నవంబర్ 5, ప్రభాతవార్త :** భగవంతున్ని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. గురునానక్ జయంతిని పురస్కరించు కొని సికింద్రాబాద్ గురుద్వారా సాహెబ్ ఆల యం వద్ద నిర్వహించిన ర్యాలీలో మోండా డివి జన్ కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొన్నా రు. ఈ సందర్భంగా నిర్వహించిన గురునానక్ దేవ్ జీ మహారాజ్ కందుజా పరివార్ వేడుకల్లో పా ల్గొన్న ఏసిపీలు ఎసుధీర్, రమేశ్, గోపాలపు రం ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌లను గురు ద్వారా సాహెబ్ అధ్యక్షులు కుల్‌దిప్ సింగ్ బగ్గా, కార్యదర్శి బల్దేవ్ సింగ్ బగ్గలు అతిథులను సత్కరించారు.



# ప్రజా రక్షణకే తొలి ప్రాధాన్యత : డీజీపీ మహేందర్‌రెడ్డి

**బేగంపేట, నవంబరు 5, ప్రభాతవార్త :** ప్రజల రక్షణ, భద్రతకే తొలి ప్రాధాన్యతని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎస్పీరోడ్డులోని అశోకా మై హోం ఛాంబర్స్‌లో టీఎంఐ గ్రూపు కార్పొరేట్ కార్యాలయాన్ని డీజీపీ మహేందర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణా ఆవిర్భావం తరువాత చిన్న రాష్ట్రంలో శాంతి బధ్రతలు, మతకలహాలు, నక్సలిజం, టెర్రరిజం పెరిగిపోతాయని ఎన్నో అపోహలు వచ్చాయన్నారు. మరికొందరు ఇదే విషయాలపై భయబ్రాంతులకు గురిచేసారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో టీఎంఐ గ్రూప్ ఛైర్మన్ మురళీధరన్, కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెశిడెంట్ ప్రదీప్‌కుమార్, ఎఫ్‌టీసీఐ మాజీ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, సామాజిక కార్యకర్త సునితా కృష్ణన్, ఓసియన్ స్పార్కిల్స్ సీఎండీ జైరాజ్, టీఎంఐ గ్రూప్ సీఈఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అశోక్‌ఆనంద్, కృష్ణారెడ్డి, జి.ఎస్‌గోపాల్‌రెడ్డి తదితరులు

## 70ఏళ్ల వయస్సులో ప్రపంచరికార్డుకోసం..

# ఈనెల 13న డాక్టర్ ఎద్దుల కృష్ణారెడ్డి కరాటే ప్రదర్శన

**హైదరాబాద్, నవంబర్ 5, ప్రభాతవార్త :** సాధించాలనే పట్టుదల ఉంటే దానికి వయస్సు అడ్డు కాదని నిరూపిస్తున్నారు డాక్టర్ ఎద్దుల కృష్ణారెడ్డి. 70ఏళ్ల వయస్సులో కరాటే నేర్చుకుని వరల్‌నడ రికార్డు కోసం ఈనెల 13న ప్రదర్శన ఇస్తున్నారు. సైదాబాద్ వివేక్‌హాస్పిటల్ నుంచి వివేకానంద విగ్రహం ట్యాంక్‌బండ్ వరకు ప్రదర్శన ఇచ్చి ప్రపంచ రికార్డుకోసం శ్రమిస్తున్నట్లు జీవిఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం 13న నిర్వహించబోయే ప్రధర్శన పోస్టర్‌ను హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎస్.అశోక్ ఆనంద్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. బాలల దినోత్సవం సందర్భంగా 9కిలోమీటర్లను 90నిమిషాల వ్యవధిలో పూర్తి చేసి ప్రపంచ రికార్డుల్లో పేరు నమోదు చేసుకోవడానికి కృష్ణారెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పి.సుధాకర్ లైన్స్‌క్లబ్, గవర్నర్, ప్రైవేట్ విద్యాసంస్థల జేఏసీ చైర్మన్ కోట్ల నిరంజన్‌రెడ్డి, జీవిఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్ గోపాల్‌రెడ్డి , అకాడమీ మాస్టర్లు కరీం, సుభాష్, సర్వర్, అమృతారెడ్డి, జానకి పైనీ,మోగినిలు పాల్గొన్నారు.

# కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యం - డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

**సికింద్రాబాద్, నవంవర్ 5, ప్రభాతవార్త :** నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు తన వంతు కృషి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. కరీంనగర్ జిల్లా వీణవంక ప్రాం తానికి చెందిన జంపయ్య అనారోగ్యం తో బాధపడుతుండడంతో డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌ను సంప్రదించారు. వారితో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించగా మంజూరైన రూ. 2లక్షలకు (ఎల్ఓసీ) సంబంధించిన పత్రాలను శనివారం వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిరుపేద కూడా కార్పొరేట్ వైద్యం పొందాలనే లక్ష్యం తో పనిచేస్తున్నామని అన్నారు. ఈ కార్యాక్రమంలో సుంకు రాంచందర్ పాల్గొన్నారు.


ఎల్ఓసి పత్రాలను అందజేస్తున్న పద్మారావు గౌడ్

## కళలకు, కళాకారులకు ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ చేస్తున్న సేవలు ప్రశంసనీయం

**- పొట్టిశ్రీరాములు తెలుగుయూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భట్టు రమేశ్**

**చిక్కడపల్లి, నవంబరు 5, ప్రభాతవార్త :** కళలకు, కళాకారులకు ప్రొఫెసర్ ప్రదీప్ కుమార్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పొట్టిశ్రీరాములు తెలుగుయూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భట్టు రమేశ్ అన్నారు. ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ అకాడమి 16 వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ప్రొఫెసర్ రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి తరుణ్‌రెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ రెడ్డి శ్యామల, పర్ ఫార్మింగ్ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ కోట్ల హనుమంతరావు, పరీక్షల నియంత్ర ణాధికారి ప్రొఫెసర్ సి.మురళీకృష్ణ, ప్రభాకరాచారి, పాత్రికేయుడు సలీమ్, వికె.దుర్గ, బ్రహ్మానందం, బక్షునాయక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాకేశ్, వెంకటాచారి, వికె.దుర్గ, ప్రభాకరాచారి ఆధ్వర్యంలో గానకచేరి అద్భుతంగా సాగింది. ఈ సంస్థ ద్వారా ఎంతో మంది నటీనటులకు భవిష్యత్తు ఉంటుందని వక్తలు పేర్కొ న్నారు. సి.అంజయ్య, పాండునాయక్, హెచ్.కె.రమేశ్, భావన, మంజుల త తదితరులు కూడా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు దైవాదీనం సంస్థ సేవలను వివరించగా భవానీ, అశోక్ సంగీతాన్ని అందించారు. డాక్టర్ హెచ్.కె.వం దన వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.



కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భట్టు రమేశ్, ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్

# సమస్యలు పరిష్కారానికి కృషి
## ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ధర్నాచౌక్, నవంబర్ 5, ప్రభాతవార్త :** కవాడిగూడ డివిజన్, దోమలగూడలో నెలకొన్న డ్రైనేజీ, మంచినీటి సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతున్నాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. శనివారం స్థానిక కార్పొరేటర్ రచనశ్రీతో కలిసి ఆయన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దోమలగూడలోని అడ్వకేట్ కాలనీలో 13 లక్షలతో డ్రైనేజి పైప్‌లైన్ పనులను, అరవింద్ కాలనీ, శివప్యాలెస్ వద్ద లక్షా ముప్పై వేల నిధులతో మంచినీటి పైప్ లైన్ పనులను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కొంత కాలంగా కాలనీ ప్రజలు డ్రైనేజి, మంచినీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టామని తెలిపారు. నెలరోజులలోగా అన్ని పనులు పూర్తి అవుతాయని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ యువనాయకులు ముఠా జైసింహ, టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు వల్లాల శ్యాం యాదవ్, బీజేపీ నేతలు వెంకటేష్, మహేందర్‌బాబు, పి.ఎన్.చారి, టీఆర్ఎస్ నాయకులు రవీందర్, రాజశేఖర్‌గౌడ్, శ్రీహరి, రాజేష్, సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న జంపనప్రతాప్ తదితరులు

# ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి : జంపనప్రతాప్

**కంటోన్మెంట్, నవంబర్ 5, ప్రభాతవార్త :** ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని స్వామి వారిని వేడుకున్నట్లు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. శనివారం న్యూ బోయిన్‌పల్లి టీటిడి కళాశాలలో నిర్వహించిన సత్యనారాయణ వ్రతం వేడుకలకు ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేందర్, టీచర్లు రామనాథం, కిషన్, సుబ్రమణ్యం, నాయకులు పెరుక మహేందర్, పవన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్పస్వాముల కాలినడక యాత్ర


స్వాగతం పలుకుతున్న శ్రీనివాస్‌గౌడ్

**బేగంబజార్, నవంబర్ 5, ప్రభాతవార్త :** సికింద్రాబాద్ గణేష్ దేవాలయం నుంచి కాలి నడకన శబరిమలై అయ్యప్ప స్వామి సన్నిదికి వెళ్తున్న అయ్యప్పస్వాములకు వివిధ పార్టీలకు చెందిన నాయకులు స్వాగతంపలికారు. ఈ సందర్భంగా జాంబాగ్ డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ ఆద్వర్యంలో స్వామిదయానంద్ నగర్ పోచమ్మ దేవాలయంలో అయ్యప్పస్వా మి పూజలలో మాజీశాసన సభ్యులు ప్రేమ్‌సింగ్‌రాథోడ్ పాల్గొన్ని పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు.


వనభోజన వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే సాయన్న

# కార్తీక వన భోజన వేడుకలు

**కంటోన్మెంట్, నవంబర్ 5, ప్రభాతవార్త :** కంటోన్మెంట్ బోయిన్‌పల్లిలోని టీటిడి శ్రీ వేంకటేశ్వర వేదాంత వర్ధిని పాఠశాల, కళాశాలలో శనివారం నిర్వహించిన కార్తీక వన బోజన వేడుకలకు కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే జి.సాయన్న ముఖ్య అతిథిగా హాజరై రుద్రాభిషేకం, రుద్ర హోమం, తులసీదాత్రి కళ్యాణం, సత్యనారాయణ వ్రతం వంటి ప్రత్యేక పూజల్లో సాయన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయన్నను కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్, రామనాథంలు ఘనంగా సత్కరించారు.

# రోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న దృశ్యం

**చార్మినార్, నవంబరు 5, ప్రభాతవార్త :** ఘాన్సీ బజార్ డివిజన్ అభివృద్ధి కోసం అన్ని విధాల కృషి చేస్తున్నానని మాజీ కార్పొరేటర్ మహ్మద్ గౌస్ అన్నారు. ఉర్దూగల్లీలో చేపట్టిన రహదారుల పనులను ఆయన శనివారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఎటువంటి ఆలస్యం చేయకుండ త్వరగా రహదారి పనులు పూర్తి చేయాలని కోరారు. ఎంఐఎం నాయకులు,స్థానిక వ్యాపారులు సునీల్ అగర్వాల్, కపూర్ చంద్ గుప్తా, కాంట్రాక్టర్ మహ్మద్ షకీల్ పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**అఫ్జల్‌గంజ్, నవంబర్ 5, ప్రభాతవార్త :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం తోపాటు ప్రతి ఒకరు తమ నివాసాల ముందు మొక్కలను నాటుకోవాలని జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ అన్నారు. శనివారం హిందినగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కె.రామకృష్ణ, అనిల్‌యాదవ్, రఘుకాంబ్లే, రేణుక, విద్యాషిండే, నాగమణి, శ్వేత, చంద్ర, కల్పన, విజయ్‌రాజ్, సందీప్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.



# లంగర్‌హౌస్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తా
## - ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

**మెహిదీపట్నం, నవంబర్ 5, ప్రభాతవార్త :** లంగర్‌హౌస్ డివిజన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి కోట్లాది నిధులను మంజూరు చేయడం జరిగిందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ తెలిపారు. డివిజన్ పరిధిలోని వినాయక నగర్‌లో దశాబ్దాల కాలంనాటి తాగునీటి పైప్‌లైన్‌ను మార్చేందుకు నూతనంగా రూ.19 లక్షల నిధులను మంజూరు చేయడంతో స్థానిక మజ్లిస్ నాయకురాలు మత్స్య రేణుక ఆధ్వర్యంలో కాలనీ వాసుల శనివారం ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్‌ను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. డివిజన్‌లోని బస్తీలు, కాలనీలలో దశాబ్దాల కాలం నాటి డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్, విద్యుత్ వంటి వాటిని తొలగించి నూతన వాటిని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం మత్స్య రేణుక మాట్లాడుతూ..వినాయక నగర్‌లో తాగునీరు కలుషిత జలాల సమస్య నిత్యకృత్యంగా మారడంతో ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి నిధులను మంజూరు చేయడం సంతోషకరమన్నారు. సన్మానించిన వారిలో వినాయకనగర్ వాసులు సురేష్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, రాఘవేందర్, అభిషేక్, రమణారెడ్డి, రమేష్, వెంకట రమణలు ఉన్నారు.




# పేదలకు వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

**కంటోన్మెంట్, నవంబర్ 5, ప్రభాతవార్త :** పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్‌గుప్త తెలిపారు. లయన్స్ క్లబ్ మీర్‌పేట్ సహకారంతో శనివారం కంటోన్మెంట్ 5వ వార్డు కాకగూడలో నిర్వహించిన ఉచిత్ర నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తేలుకుంట మాట్లాడుతూ కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కంటి పొర,ఇతర అపరేషన్లకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు యాదగిరి, కార్యదర్శి కుమార్, లయన్స్ క్లబ్ మీర్‌పేట్ అధ్యక్షుడు మల్లికార్జున్, కార్యదర్శి శ్రీనివాస్, ప్రతినిధులు మధు, నవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధితో కార్పొరేట్ వైద్యం - వెంకటేష్ యాదవ్

**నార్సింగి, నవంబర్ 5 ప్రభాతవార్త :** సీఎం సహాయ నిధితో నిరుపేదలు కార్పొరేట్ వైద్యంను పొందుతున్నారని నార్సింగి మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం నార్సింగి మున్సిపల్ పరిధిలోని కోకాపేట్‌కు చెందిన మహేష్‌కు రూ.లక్ష సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును వెంకటేష్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య పాలనలో పెద్ద జబ్బులు వస్తే నిరుపేదలు దేవుడిపై భారం వేసి బాధపడుతూ ఉండే వారని, స్వరాష్ట్రం వచ్చాక సీఎం కేసీఆర్ అర్హులందరికి సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు హరిశంకర్, మల్లేష్ యాదవ్, గణేష్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న్ వెంకటేష్ యాదవ్

# పాతబస్తీ ఉర్దూగల్లీలో విద్యుత్‌కు అంత రాయం

**చార్మినార్, నవంబరు 5, ప్రభాతవార్త :** పాతబస్తీ ఉర్దూగల్లీలో రహదారి నిర్మాణం కోసం రోడ్డు తవ్విన సమయంలో విద్యుత్ కేబుల్ తెగి పోవటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. జిహెచ్ఎంసి అధికారులు శుక్రవారం అర్ధ రాత్రి ఉర్దూగల్లీలో రోడ్డును జెబిఎస్‌తో తవ్వించారు. రహదారి తవ్వుతున్న సమయంలో విద్యుత్ కేబుల్స్ తెగిపోయాయి. దీంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శనివారం మధ్యాహ్నం రెండు గంటల సయయంలో విద్యుత్ సరఫరా అయింది. దాదాపు 14 గంటలు పాటు విద్యుత్ సరఫరా లేకపోవటంతో ఉర్దూగల్లీకి చెందిన వ్యాపారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురియ్యారు.

# ఎంఎన్‌జె ఆస్పత్రిలో అన్నదానం

**గన్‌ఫౌండ్రి, నవంబర్ 5, ప్రభాతవార్త :** టిఎన్‌జిఓ యూనియన్, అసద్‌అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఎం.ఎన్.జె క్యాన్సర్ ఆసుపత్రి రోగులకు సహాయకులకు డాక్టర్.సేవరత్నా, టిఎన్‌జిఓ అధ్యక్షులు ఎస్.ఎం.ము జీబ్‌హుస్సేనీ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు నరేష్‌కుమార్, నాలుగవ తరగతి అసోసియేట్ అధ్యక్షులు ఎం.ఎ ముజీబ్, క్యాన్సర్ ఆసుపత్రి యూనిట్ సభ్యులు శివకుమార్, సలహాదారులు ఉస్మాన్ అలీ, ఉస్మానీ, పి.ఆర్.ఓ వహిద్ తదితరులు పాల్గొన్నారు.



## సుందరం సుమధురం కమనీయం 'శశిరేఖా పరిణయము' కూచిపూడి నృత్యరూపకం



**రవీంద్రభారతి, నవంబరు 5, ప్రభాతవార్త :** ప్రముఖ సంస్థ నాదప్రభ ఆధ్వర్యంలో శనివా రం రాత్రి రవీంద్రభా రతి ప్రధాన మందిరం లో 'శశిరేఖా పరిణ యం' కూచిపూడి నృత్య రూపకం అత్యంత సుందరం, సుమ ధురం, కమనీయం గా ప్రదర్శింపబడింది. ముఖ్య కథాంశంలోకి వెళితే దశమి లగ్నంలో ఆహ్వానం అందుకున్న కౌరవులు ద్వారకకు చేరివ వివాహం జరుపు సమయంలో మాయా శశిరేఖ అయిన ఘటోత్కచుడు తన మాయాజాలంతో లక్షణ కుమారుడుని పలు అవస్థలకు గురిచేసి మూర్ఛనొందింప, బలభద్రుడు ఆగ్రహించి దుర్యోధనుని మందలించగా అతడు అసలు విషయం తెలియక తడబడుతుండగా ఘటోత్కచుడు నిజరూపము ధరించి దుష్ట చతుష్టయములు, వారి పరివారములను చిత్రహింసలు పెట్టి, హెచ్చరించి పారద్రోలి, బలరాముడుకి అసలు సంగతి తెలిపి ఈ ముహూర్తమునకే శశిరేఖా అభిమన్యులకు సలక్షణముగా పెద్దల అంగీకారము, శుభాశీస్సులతో 'శశిరేఖా పరిణయము' వైభవంగా జరుగుతుంది.

# వీధి కుక్కల దాడులు అరికట్టాలని సమావేశం

**యూసుఫ్‌గూడ, నవంబర్ 5, ప్రభాతవార్త :** వీధి కుక్కల దాడి వల్ల ఇటీవల అనేక మంది గాయాలపాలైన సంఘటనలు దృష్టిలో పెట్టుకుని శనివారం మధురానగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీకి సంబంధంలేని వారు అక్కడకు వచ్చి ప్రధాన రహదారి పక్కన, పార్కులు, స్కూల్ జోన్లలో కుక్కలకు భోజనం పెట్టవద్దని సూచించారు. జంతు ప్రేమికులు మీప్రాంతాల్లోనే షెడ్డులను ఏర్పాటు చేసుకుని పెంచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో వెటర్నరీశాఖ మరో అధికారి డాక్టర్ అబ్దుల్లా, కాలనీ అసోసి యేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోడె సాంబశివరావు, కల్యాణ చక్రవర్తి, అసోసియేషన్ ప్రస్తుత, మాజీ నాయ కులు సుగుణ, శ్రీ లక్ష్మిరెడ్డి, విజయవాణి, జీఎస్ఆర్‌కే ప్రసాద్, రామారావు, అజయ్‌కుమా ర్, ఎస్ఆర్‌నగర్ ఎస్సై సందీప్‌నాయుడు పాల్గొన్నారు.



## మురికికూపంగా మాసబ్ చెరువు... విచ్చలవిడిగా వ్యర్థాల పడవేత... పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు




**తుర్కయంజాల్, నవంబర్ 5 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసబ్ చెరువు మురికికూపంగా మారుతోంది. చెరువులో విచ్చలవిడిగా వ్యర్థాలను పడవేస్తూ తటాకం ఉనికిని దెబ్బతీస్తున్నారు. వర్షాకాలంలో భారీ వర్షాలతో చెరువు నిండుకుండలా స్వచ్ఛంగా ఉన్నా... తుర్కయంజాల్ పరిధిలోని కమ్మగూడ, రాగన్నగూడ, మన్నెగూడనుంచి వస్తున్న డ్రైనేజీ అంతా చెరువులోనే కలుస్తోంది. ఇటువైపున బడంగ్‌పేట, గుర్రంగూడ నుంచి కూడా కొన్ని గ్యాలన్ల డ్రైనేజీ, మురికి నీరంతా చెరువులోనే కలుస్తూ మరో హుసేన్ సాగర్‌ను తలపిస్తోంది. చెరువు కట్టపై పార్కు ఉండడంతో ప్రజలు ఎంతో ఆనందంగా, సంతోషంగా ఉదయం వాకింగ్, రోజంతా వందల జనాభా వస్తూ వెళుతూ మాసబ్ చెరువును చూసి ఆనందం వ్యక్తం చేస్తుంటారు. ఇదంతా ఒకవైపు అయితే మరోవైపు చెరువులో విచ్చల విడిగా వ్యర్థాలను పడవేయడంతో తీవ్ర దుర్గంధం ఏర్పడంతో దానిని తట్టుకోలేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు కానీ ప్రజాప్రతినిధులుగాని దీనిపై పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసి ఆ వ్యర్థాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా ఆదివారం వస్తే కట్టపై ఉన్న కట్ట మైసమ్మ ఆలయానికి నిత్యం పదుల సంఖ్యలో భక్తులు గొర్రెలు, మేకలు, కోళ్ల వంటి వాటిని బలి ఇస్తూ, వాటి వ్యర్థాలను కూడా చెరువులోనే పడేస్తున్నారు. ఆలయం వెలుపల పడిన రక్తం,ఇతరత్రా వాటిని నేరుగా చెరువులోనే కలిసేలా ఓ పైపు ఏర్పాటు చేశారు. కానీ ప్లాస్టిక్ కవర్స్, ప్లాస్టిక్ బాటిల్స్, చెత్త చెదారం, తీసి వేరే చోటకి తరలించడం లేదు. వాటిని కూడా చెరువులో పడవేయడంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులకు,గుడికివచ్చే భక్తులు విపరీతమైన దుర్వాసన వెదజల్లుతుండడంతో సుందరంగా కనిపిస్తున్న చెరువును చూసేందుకు వచ్చిన పర్యాటకులకు ముక్కుపుటాలు పగిలే విధంగా వాసన వస్తుండటంతో ఎక్కువసేపు నిలబడలేక వెళ్లిపోవాల్సి వస్తుంది. ఇంకా మందురాయుళ్లతో పర్యాటకులకు మరింత ఇబ్బందిగా ఏర్పడింది. ముఖ్యంగా చెరువు తూము దగ్గర పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. తూము దగ్గరకు వెళ్లేందుకు నేరుగా దారి ఉండటంతో మలవిసర్జన చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెరువు కాపాడాలని, చెరువులోని వ్యర్థాలను తీసి చెరువు ఉనికిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## మతి స్థిమితంలేని అభాగ్యుడిని ఆదుకోవాలని మాతృదేవోభవ ఆశ్రమం వినతి



బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన మతి స్థిమితం లేని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

సరూర్‌నగర్, నవంబర్ 5 ప్రభాతవార్త: స్వంత కుటుంబ సభ్యుల తీరు వల్ల అనాధగా మారి మతిస్థిమితం కోల్పోయి రోడ్లపై అయోమయంగా తిరుగుతూ మాతృదేవోభవ ఆశ్రమానికి చేరి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేసే కార్తీక్‌ను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఆశ్రమ నిరా్వహకుడు గట్టు గిరి కోరారు. అవివాహితుడైన కార్తీక్‌ను స్వంత కుటుంబ సభ్యులే మోసం చేయడంవల్ల అతను తట్టుకోలేక మతిస్థిమితంకోల్పోయి రోడ్లపై తిరుగుతుంటే తాము నాదర్‌గుల్ ఆశ్రమానికి చేర్చామని ఆయన వెల్లడించారు. అయితే షాక్‌లో ఉన్న కార్తీక్ తన కుటుంబ సభ్యుల తీరును తలచుకుని బాధపడుతూ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడం వల్ల తాము ఒవైసీ ఆసుపత్రిలో చేర్పించామని ఆయన వెల్లడించారు. కార్తీక్ వైద్య చికిత్సలకు మానవతావాదులు సహకరించాలని గిరి కోరారు.

## వికలాంగుల హక్కుల సమితి జిల్లా అధ్యక్షురాలిగా సువర్ణ

**ఉప్పల్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలిగా ఉప్పల్‌కు చెందిన పోకల సువర్ణ నియమితులైయ్యారు. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వికలాంగుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్,గ్రేటర్ అధ్యక్షులు వినోద్ లక్ష్మన్, నరేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉప ఎన్నికలకు బిజెపి బిగ్ స్క్రీన్



బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన తెర

**ఎల్.బి.నగర్, నవంబర్ 5 ప్రభాతవార్త :** సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ కార్పొరేటర్ కార్యాలయంలో మునుగోడు ఉపఎన్నికల కౌంటింగ్ చూసేందుకు బిగ్ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశామని కార్పొరేటర్ తెలిపారు. బిజెపి జెండాలు, బెలూన్లు, రంగులు, మిఠాయిలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లను చేశారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బేతి

**ఉప్పల్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితోపాటు, టిఆర్ఎస్ నేతలు వెంకటేశ్వరరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## గిరిజన బంధు వెంటనే అమలు చేయాలి

**తుర్కయంజాల్, నవంబర్ 5 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల ఆర్థికంగా ఎదగాలంటే ప్రభుత్వ ప్రోత్సాహం అవసరమని ప్రభుత్వం వెంటనే గిరిజన బంధు అమలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మనాయక్ పేర్కొనానరు. శనివారం తుర్కయాంజాల్‌లోని సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా కన్వీనర్ పి.శ్రీను నాయక్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గిరిజనులకు ఇచ్చిన హామీలో భాగంగా గిరిజన బంధు అమలు చేయాలని, అదేవిధంగా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాండునాయక్, గోపినాయక్, వెంకటేశ్ నాయక్,శంకర్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, రాజునాయక్, శ్రీధర్ నాయక్, కిషన్‌నాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

## మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నరసింహగుప్తా

**ఎల్.బి.నగర్, నవంబర్ 5 ప్రభాతవార్త :** పగిలిన మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించామని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నరసింహగుప్తా పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్ భవానినగర్‌కాలనీలో మంచినీటి పైప్‌లైన్ పగిలి నీరువృధా పోతుందని కాలనీవాసులు శనివారం కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు అక్కడికి చేరుకొని వెంటనే జలమండలి జిఎం బలరామరాజుతో ఫోన్లో మాట్లాడి మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ విజ్ఞప్తి మేరకు జలమండలి ఇన్స్పెక్టర్ సురేందర్, లైన్‌మాన్ రవీందర్ అక్కడికి చేరుకొని మరమ్మతులను చేయించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి అధ్యక్షుడు వినోద్‌యాదవ్ పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతి



ఎమ్మెల్యేను కలిసిన తెలంగాణ పద్మావతి కాలనీవాసులు

**హయత్‌నగర్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని తెలంగాణ పద్మావతి కాలనీ సర్వేనెంబర్లు 335,336, 337, 340లోని అసైన్డ్ స్థలాల రిజిస్ట్రేషన్లను జీవోనెంబరు 118లో చేర్చాలని కోరుతూ కాలనీవాసులు శనివారం ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సంవత్సరాల తరబడి ఉన్న రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు అంజిరెడ్డి, చక్రవర్తి, ప్రతినిధులు శ్రీనివాస రాజు, అంజయ్య, గోపాల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


## భారత్‌జోడోయాత్రలో పాల్గొన్న దేప



జయరాంరమేష్‌తో కలిసిన దేప భాస్కర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, నవంబర్ 5 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జూడో యాత్రలో మహేశ్వర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రాహుల్‌గాంధీ భారత్‌జోడోయాత్రలో దిగ్విజయంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ యాత్రలో పాల్గొన్న కేంద్రమాజీ మంత్రి దిగ్విజయ్‌సింగ్, కేంద్ర మాజీమంత్రి జైరాంరమేష్, మాజీ మంత్రి షబ్బీర్‌అలీతో కలిసి దేప భాస్కర్‌రెడ్డి చర్చించారు.

## రాజగోపాల్‌రెడ్డి గెలవాలని పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

**ఎల్.బి.నగర్, నవంబర్ 5 ప్రభాతవార్త :** మునుగోడు ఉప ఎన్నికలలో బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వారి మెజార్టీతో విజయం సాధించాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్‌కుమార్ తెలిపారు. ఉపఎన్నికలలో రాజగోపాల్‌రెడ్డి విజయం సాధించాలని సరూర్‌నగర్‌లోని బంగారు మైసమ్మ దేవాలయంలో అమ్మవారికి కార్పొరేటర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా శివలింగానికి అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల అంజన్‌కుమార్, కరాటే రాజు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ. 2కోట్ల 64లక్షలతో సీసీరోడ్డు, ఆర్‌సిసి పైప్ లైన్ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

**నేరెడ్‌మెట్, నవంబర్ 5 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గంలోని డివిజన్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని మౌలాలి డివిజన్ పరిధిలోని సంతోషిమానగర్, భరత్‌నగర్, సదుల్లా నగర్ గ్రేవ్ యార్డు, హనుమాన్‌నగర్, ఆర్‌టిసికాలనీల్లో సీసీరోడ్డు పనులు, భరత్‌నగర్ చర్చిరోడ్డు లైన్‌లో ఆర్‌సిసి పైప్‌లైన్ పనులను కార్పొరేటర్, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కుంటున్న ఇబ్బందులను పరిష్కరించడమే తన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్,డిఇ మహేష్, ఏఈ మధులత, నాయకులు అమీనుద్దీన్, జివిఎన్ సతీష్, రాము యాదవ్, భాగ్యనంద్, సత్తయ్య, మంద భాస్కర్, సంతోష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

**మౌలాలికమాన్ భూబాధితులకు చెక్కులపంపిణీ...** మౌలాలి కమాన్ వైడెనింగ్ పనుల్లో స్థలాన్ని కోల్పోయిన బాధితులకు శనివారం ఎమ్మెల్యే మైనంపల్లి చెక్కులను అందించారు. మౌలాలి కమాన్ పనుల్లో స్థలాన్ని కోల్పోయిన షేక్‌బషీర్‌కు రూ. 9లక్షల27వేలు, మీర్జా హైదర్ హుస్సేన్‌కు రూ.19లక్షల 20వేల 360లను ఆయన అందిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ హయాంలో పేద ప్రజలకు ఎటువంటి అన్యాయం జరగదన్నారు.

## ఓపెన్ స్పేస్ జోన్‌ను తొలగించాలని మంత్రికి కాలనీవాసుల వినతి



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం సమర్పించిన కాలనీల ప్రజలు

**సరూర్‌నగర్, నవంబర్ 5 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ ఆశంగారిరెడ్డి కాలనీ, రోమా-2 కాలనీ, శ్రీ లక్ష్మీహిల్స్ కాలనీలలో ఉన్న కొన్ని సర్వేనెంబర్లను ఓపెన్ స్పేస్ జోన్ నుండి తొలగించి రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చాలని కాలనీవాసులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డిని కోరారు. శనివారం వారు టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు భీమిడి జంగారెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓపెన్స్ స్పేస్‌లో ఉండడం వల్ల కలుగుతున్న ఇబ్బందుల దృష్ట్యా తమ కాలనీలకు సంబంధించిన నిర్దేశిత సర్వే నెంబర్లను రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘాల నాయకులు, కాలనీలవాసులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ సతీమణిని పోలీస్ స్టేషన్‌కు తరలింపు హేయమైన చర్య : కార్పొరేటర్ బద్దం



పోలీసుల అదుపులో ఉన్న కార్పొరేటర్ సతీమణి సృజనారెడ్డి

**ఎల్.బి.నగర్, నవంబర్ 5 ప్రభాతవార్త :** గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమహేశ్వర్‌రెడ్డి సతీమణి బద్దం సృజనరెడ్డిని శనివారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ తరలించారు. బంజారాహిల్స్‌లోని పెద్దమ్మ దేవాలయానికి వెళ్లి వస్తుంటే బంజారాహిల్స్ పోలీసులు సృజనారెడ్డి వస్తున్న వాహనాన్ని ఆపి పోలీస్‌స్టేషన్ తరలించారని కార్పొరేటర్ ప్రేమహేశ్వర్‌రెడ్డి తెలిపారు. తన సతీమణి కుటుంబ సభ్యులతో కలిసి దేవాలయానికి వెళ్లి వస్తుంటే పోలీసులు ఎందుకు వాహనాన్ని ఆపాల్సి వచ్చిందని, పోలీస్‌స్టేషన్‌కి ఎందుకు తీసుకెళ్లాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు తమ కుటుంబ సభ్యులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లాల్సిన అవసరం ఏమి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. నడిరోడ్డుపై వాహనాన్ని ఆపి తన సతీమణిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లడం హేయమైన చర్య అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి జండా కనబడితే పోలీసులకు మనకు పుడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ నాయకుల మెప్పు పొందడానికి పోలీస్‌అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. తన సతీమణిని అకారణంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లిన పోలీసులపై కేసు నమోదు చేయాలని, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని, తమకు న్యాయం జరిగే వరకూ న్యాయపోరాటం చేస్తానని కార్పొరేటర్ తెలిపారు.

## రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

**ఎల్.బి.నగర్, నవంబర్ 5 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం సంతరించుకుంటుందని యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. భారత్ జూడో యాత్ర కార్యక్రమంలో ఉన్న రాహుల్‌గాంధీని శనివారం మధురఉపేందర్ రెడ్డి కలిసి సిల్వర్ గోమాత విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

## గ్రీన్‌పార్క్ కాలనీ రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరించాలని వినతి

**సైదాబాద్, నవంబరు 5 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్‌పార్క్ కాలనీలో రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి వినతిపత్ర ం అ ందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంబంధిత అధికారులతో చర్చించి తగిన న్యాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కమలేష్‌రెడ్డి, కార్యదర్శి బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కృషి వల్లే రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛ ం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 5 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్‌లోని పలు కాలనీల్లో ఎన్నో ఏండ్లుగా ఉన్న రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారమైనందున ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్‌లోని ఆయా కాలనీవాసులు శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రిజిస్ట్రేషన్, యుఎల్‌సి సమస్య పరిష్కారం కోసం సహకరించిన కలెక్టర్, రెవిన్యూ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ జిఒ విడుదల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ఉన్న రిజిస్ట్రేషన్ సమస్యను ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటిఆర్‌ల సహకారంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు నల్ల రఘుమారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు రోజారెడ్డి, కాలనీవాసులు చంద్రమోహన్‌రెడ్డి,చంద్రమౌళి, దుర్గారెడ్డి, సాయిరాం, అంజిరెడ్డి,సత్తయ్య, జనార్ధన్‌రెడ్డి, నర్సిరెడ్డి, వసంత, ప్రకాష్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, బలరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్షౌర వృత్తి వ్యాపారంలోకి కార్పొరేట్ సంస్థలు రాకుండా నిరోధించాలి



మీర్‌పేట్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న క్షౌర వృత్తిదారులు

**సరూర్‌నగర్, నవంబర్ 5 ప్రభాతవార్త:** తెలంగాణలో క్షౌర వృత్తివ్యాపార రంగంలోకి బడా పెట్టుబడిదారులైన కార్పొరేట్ సంస్థలు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు అన్నందాస్ చంద్రశేఖర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. క్షౌర వృత్తి రంగంలోకి రిలయన్స్ సంస్థలు ప్రవేశించడాన్ని నిరసిస్తూ శనివారం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మీర్‌పేట్ చౌరస్తాలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించి కార్పొరేట్ సంస్థ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్షలాది మంది క్షౌర వృత్తిని నమ్ముకొని జీవనోపాధి పొందుతున్నారనీ, కార్పొరేట్ సంస్థలు క్షౌర వృత్తిలోకి రావడం ఆందోళన కలిగించే విషయమని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నాయీ బ్రాహ్మణ కుటుంబాలకు అండగా నిలవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రసంఘం ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్, మీర్‌పేట్ అధ్యక్షుడు ప్రమోద్, లెనిన్‌నగర్ అధ్యక్షుడు గడియాల కృష్ణ, జిల్లెలగూడ అధ్యక్షుడు శివకుమార్, మాట్రిక్స్ వెంకటేశ్, రాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, నవంబర్ 5 ప్రభాతవార్త :** మూసారంబాగ్ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని బ్యాండ్ బస్తీ, పెద్ద మజీద్ వద్ద కొనసాగుతున్న డ్రైనేజీ పనులను సంబంధిత జలమండలి మేనేజర్ చంద్రునాయక్, బస్తీవాసులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎట్టకేలకు కొనిన సంవత్సరాల తర్వాత పైప్‌లైన్ వేయిస్తున్నామని తాగునీటి సరఫరాల మురుగునీరు కలువకుండా శాశ్వత పరిష్కారం దిశగా పనులు పూర్తి చేయాలని మేనేజర్ చంద్రు ను ఆదేశించారు. అదే విధంగా ఇంటింటికి డ్రైనేజీ కనెక్షన్‌ను వెంటనే ఆదేశించాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, సురేందర్, సదానంద్, ప్రభాకర్, శంకర్, సంతోష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## చిలుకానగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



ఉచిత వైద్య శిబిరంలో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న బండారి లక్ష్మారెడ్డి, బన్నాల గీత, నెర్థం భాస్కర్‌గౌడ్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పార్టీ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం చిలుకానగర్‌లో నెర్థం బాలయ్య, భాగ్యలక్ష్మి ట్రస్ట్ అధ్యక్షుడు, టిఆర్ఎస్ నేత నెర్థం భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి టిఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు అంబటి జగదీష్, శ్రీనివాస్‌రెడ్డి, గోపు సదానంద్, ఆకుల మహేందర్, అన్య బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న నెర్థం ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. పేదల కోసం పాటుపడే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు.

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో భరత నాట్య ప్రదర్శనలు

**ఉప్పల్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నల్ల పద్మజ శిష్య బృందంచే భరత నాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గణేషా పంచరత్న, పుష్పాంజలి, విఘ్నేశ్వర శ్లోకం, ద్యాన శ్లోకం, అన్నమాచార్య కీర్తన, వసంత జతి స్వరం, రామదాసు కీర్తన తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు హసిని, సిరిచందా, మధురాక్షి, దృవిక, తనయ, నిక్షిత, గీత, జాహ్నవి, ప్రన్విత, అముక్త, లహరి, శ్రావిక, రిత్విక, మౌక్తిక తదితరులు తమ ప్రదర్శనలతో మెప్పించారు. వారంతపు సెలవు కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన వుందని నిర్వాహకులు తెలిపారు.

## ఘనంగా బచ్‌పన్ స్కూల్లో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు




వేడుకలకు హాజరైన రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, వేడుకల్లో పాల్గొన్న చిన్నారుల గ్రాండ్ పేరెంట్స్

**వనస్థలిపురం, నవంబర్ 5 ప్రభాతవార్త :** వనస్థలిపురం హిల్ కాలనీలోని బచ్‌పన్ స్కూల్లో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథులుగా బచ్‌పన్ స్కూల్స్ రీజినల్ డైరెక్టర్ కె. శ్రీకాంత్‌రెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా విద్యార్థుల అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలు, అడ్మిన్, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రుల దగ్గర కన్నా అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యల దగ్గరే చనువుగా ఉంటారని, వారు చెప్పే మంచి మాటలు, కథలు పిల్లలు చక్కగా వింటారని, పెద్దలు తమ అనుభవంతో నేర్చుకున్న పాఠాలు పిల్లలకు మార్గదర్శకాలుగా నేర్పి, వారి జీవితాలను బంగారు బాటలో నడిపించాలని పేర్కొన్నారు. విద్యార్థులు, వాళ్ళ గ్రాండ్ పేరెంట్స్ ఆటపాటలతో ఈ ఉత్సవం చూపరులకు కనుల విందు చేసింది.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మున్సిపల్ సిబ్బందిచే డ్రైనేజీ శుభ్రం చేయిస్తున్న లక్ష్మీప్రసన్న

**వనస్థలిపురం, నవంబర్ 5 ప్రభాతవార్త :** బియన్‌రెడ్డి నగర్ డివిజన్ వైదేహినగర్‌లోని శివాలయం ముందు డ్రైనేజీ మురుగు నీరు పొంగి రోడ్డు పై ప్రవహిస్తుండడం చూసిన మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్‌గౌడ్ కార్తీకమాసం పురస్కరించుకొని శివాలయానికి అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండాలనే భావనతో డ్రైనేజీ సమస్య పరిష్కారానికై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. స్పందించిన అధికారులు తమ సిబ్బందిని, (గల్ఫర్ బండిని) పంపించి పనులు ప్రారంభించారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు.

## ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**సరూర్‌నగర్, నవంబర్ 5 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్‌లోని మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకాలకు ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధిక తెలిపారు. 2022-2023 విద్యాసంవత్సరానికి గాను హవర్లీ (గంటల) బోధన పద్ధతిలో మొత్తం 5 లెక్చరర్ పోస్టుల భర్తీ ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఇంగ్లం, గణితం, వృక్ష శాస్త్రం, జంతు శాస్త్రం, భౌతిక శాస్త్రంలకు సంబంధించి ఒక్కో పోస్టు ఖాళీ ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 50 శాతం మార్కులతో పాస్ అయిన ఎస్సీ, ఎస్టీలు అదే విధంగా సంబంధిత సబ్జెక్టులలో పిహెచ్‌డి కలిగిన వారికి లేని పక్షంలో ఎన్‌ఇటి/ఎస్‌ఇటి అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఆమె వెల్లడించారు. వీరు కూడా లేని పక్షంలో పిజి అభ్యర్థుల నుండి ఎంపికలు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా బోధనానుభవం కలిగిన వారికి వెయిటేజ్‌ఇవ్వడం జరుగుతుందనీ అందుకు సంబంధిత అభ్యర్థులు తమ సర్వీసు సర్టిఫికెట్‌ను జతపరచాలని ఆమె సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం 3గంటలలోపు బడంగ్‌పేట్‌లోని కాలేజీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ప్రిన్సిపాల్ కోరారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూలు 10వ తేదీన ఉదయం 10 గంటలకు హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలో ఉంటాయని ఆమె వెల్లడించారు.

## ఉప్పల్ ఆరోగ్య కేంద్ర సిబ్బందికి నాయకుల ఘన సత్కారం

**ఉప్పల్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని టిఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వ్యక్తికి ఫిట్స్‌రావడంతో ప్రభుత్వవైద్యాధికారి డా.మంజులవాణి, డా.సౌందర్యలత స్పందించి తక్షణ వైద్య సదుపాయం అందించారు. దీంతో విషయం తెలుసుకున్న లక్ష్మారెడ్డి వైద్య సిబ్బందిని ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సకాలంలో వైద్య సేవలు అందించిన వైద్య సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. ప్రజలకోసం పాటుపడే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ఆకుల మహేందర్, ఆన్య బాలకృష్ణ, నవీన్‌గౌడ్, మహేష్‌గౌడ్, మాస శేఖర్, జైపాల్‌రెడ్డి, సుక్క కిరణ్, నిరంజన్‌చారి తదితరులు పాల్గొన్నారు.